ట్రాక్టర్ ట్రాలీ కింద పడి బాలుడు దుర్మరణం

- తోటి స్నేహితుడితో కలిసి సైకిల్ తొక్కుతూ జారి పడి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై (ఇన్‌సెట్) రోహిత్ సింగ్

తాళ్లూరు (ముండ్లమూరు): తోటి స్నేహితుడితో కలసి హుషారుగా సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ కింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...తూర్పుగంగవరంలో పరమార్ రోహిత్ సింగ్ (11) అనే బాలుడు తోటి స్నేహితుడితో కలిసి పాఠశాల వదిలిన తర్వాత సైకిల్‌పై ప్రధాన వీధిలో వెళ్తున్నాడు. అంతకు ముందుగా కంకర లోడ్‌తో ట్రాక్టర్ వెళ్తోంది. ఆ ట్రాక్టర్‌ను క్రాస్‌చేస్తూ ఒకరికి పక్కన ఒకరు వెళ్తూ ఒక్కసారిగా రోహిత్ కింద పడి పోయాడు. అదే సమయంలో ట్రాక్టర్ ట్రాలీ టైర్ ఎక్కటంతో తల నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్సై మోహన్‌రావు పరిశీలించారు.

తీవ్ర విషాదంలో కుటుంబం..

రాజస్థాన్‌కు చెందిన పరమార్ లక్ష్మణ్, అనిత దంపతులు మూడు దశాబ్దాల క్రితం తాళ్లూరు మండలానికి వచ్చి స్థిర పడ్డారు. తూర్పుగంగవరంలో లక్ష్మణ్ సెల్ షాపు నిర్వహిస్తున్నాడు. వారికి కోమల్, రోహిత్ ఇరువురు సంతానం కాగా మృతుడు రెండో కుమారుడు. హుషారుగా తిరుగుతూ ఒక్కసారిగా ప్రమాదంలో మృతి చెందటంతో స్థానికులు విషాదంలో మునిగి పోయారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

డాక్టర్‌పై లైంగిక ఆరోపణలు అవాస్తవం

ఒంగోలు అర్బన్/పుల్లలచెరువు: పుల్లలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున గౌడ్‌పై ఏఎన్‌ఎం చేసిన ఆరోపణలు అవాస్తవమని సంఘటనపై విచారణ జరిపిన జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ నివేదికలో తెలిపినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ వివరాలను ఒక ప్రకటన ద్వారా తెలియచేసారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పుల్లలచెరువు పీహెచ్‌పీ వైద్యాధికారిపై నాయుడుపాలెం సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న మహిళ లైంగికంగా వేధింపుల ఆరోపణలు చేయడంతో విచారణ చేపట్టామని తెలిపారు. సచివాలయంలో జరిగిన గొడవలతో కొందరు ఉద్యోగుల సమక్షంలో ఏఎన్‌ఎం యాంటీబయోటిక్ సిరప్‌ను మోతాదుకు మించి తాగిందని, అయితే మీడియాకు మాత్రం పాయిజన్ తీసుకున్నట్లు చెప్పిందని వివరించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నందున డిశ్చార్జ్ కావాలని డాక్టర్‌లు తెలిపినా వివిధ కారణాలతో ఆసుపత్రిలో ఉందని తెలిపారు. తదుపరి విచారణ అనంతరం ఎవరి తప్పు ఉందని తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా ఏఎన్‌ఎం దేవికాబాయ్ ఉదంతంపై మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బంది, చాపలమడుగు సబ్‌సెంటర్ పరిధిలోని సిబ్బందిని విచారించి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎస్సై శ్రీహరి ఉన్నారు.

మేకల మందపై చిరుత దాడి

గిద్దలూరు రూరల్: మేకల మందపై చిరుత పులి దాడి చేసిన ఘటన గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... దిగువమెట్ట సమీపంలోని తండాలో గురువారం రాత్రి 12 గంటల సమయంలో గ్రామానికి చెందిన వాల్మీకి నాయక్, శ్రీరామ్ నాయక్ మేకల దొడ్డిలో గుంపు, గుంపులుగా ఉన్న మేకలపై చిరుతపులి దాడి చేసింది. ఒక మేకను చంపి రక్తం తాగి వదిలేసింది. మరొక మేకపై దాడి చేసి పక్కకు లాక్కెళ్లి మాంసాన్ని తిని వెళ్లిపోయింది. శుక్రవారం ఉదయం గమనించిన మేకల పోషకులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చిరుత పాదముద్రలను సేకరించారు.


తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

పొదిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు గడుపులోపు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ కే.సుబ్బారావు ఉన్నారు.

పీటీజీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: స్థానిక గిరిజన గురుకుల విద్యాలయం(పీటీజీ) పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్లో 6వ తరగతిలో బాలుర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.చిట్టిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో 6వ తరగతిలో 30 సీట్లు, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 18, 9వ తరగతిలో 17 బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 18న స్పోర్ట్స్ సెలక్షన్ నిర్వహించనున్నట్లు వివరించారు. గత ఏడాది 5వ తరగతి పూర్తి చేసిన ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 8309462537ను సంప్రదించాలని సూచించారు.

చదువుల వనమాలి అందుకో నివాళి



మైనారిటీలకు వరం

4 శాతం బీసీ-ఈ రిజర్వేషన్

- వైఎస్సార్ నిర్ణయంతో చదువులో రాణిస్తున్న ముస్లిం విద్యార్థులు
- మహానేత చేసిన మేలు మరువలేనిదంటూ కృతజ్ఞతలు

కంభం: వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న ఓ నిర్ణయం మైనారిటీలకు వరంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయంతో ముస్లిం యువతకు విద్య, ఉద్యోగవకాశాలు మెరుగయ్యాయి. గతంలో ఎందరో పేద తల్లిదండ్రులు తమ పిల్లల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఉన్నత చదువులు చదివించుకోలేకపోయేవారు. ఉద్యోగవకాశాలు తక్కువగా ఉండేవి. ఇక ఎంబీబీఎస్ లాంటి ఉన్నత చదువులు వారికి కలగా మిగిలిపోయేవి. వెనుకబడిన ముస్లింల అభ్యున్నతి కోసం ఆనాడు వైఎస్సార్ ప్రవేశ పెట్టిన బీసీ–ఈ రిజర్వేషన్ల పుణ్యమా అని ఎంతో మంది మైనారిటీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడంతోపాటు మంచి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఒక్క కంభం పట్టణంలో సుమారు 25 మందికి పైగా విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నారు.

అక్కాచెల్లెళ్లు ఎంబీబీఎస్‌లు



షేక్ జాస్మిన్



షేక్ జవీరియా

కంభం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు షేక్ ఖాసింబాషాకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె షేక్ జాస్మిన్ ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతోంది. జాస్మిన్‌కు ఆలిండియా స్థాయిలో 24,000 ర్యాంక్, స్టేట్‌లో 1230 ర్యాంక్ వచ్చింది. బీసీ–ఈ కోటాలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఆమెకు సీటు దక్కింది. చిన్న కూతురు షేక్ జవీరియా నీట్‌లో స్టేట్‌ర్యాంక్ 2400 రాగా బీసీ–ఈ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొంది ప్రస్తుతం కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఫైనలియర్ చదువుతోంది. వైద్యులుగా పేద ప్రజలకు సేవ చేస్తామని అక్కాచెల్లెళ్లు చెబుతున్నారు.



పీజీ కోసం సిద్ధమవుతున్నా

పట్టణానికి చెందిన ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం కుమారుడు షేక్ ఫారుక్ విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేశారు. దివంగత ముఖ్యమంత్రి ముస్లింల సంక్షేమాన్ని కాంక్షిస్తూ బీసీ–ఈ కోటా కింద 4 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ఎంతో మందికి మేలు చేకూరిందని, తాను మంచి కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేయగలగడానికి అదే కారణమని ఫారుక్ తెలిపారు. ప్రస్తుతం పీజీ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ పొందుతున్నారు.

ప్రతిభావంతులకు ప్రయోజనం

కంభం పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌వలి కుమారుడు షేక్ మహబూబ్ షరీఫ్ విజయవాడ నిమ్రా మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేశారు.డాక్టర్ కావాలన్న తన లాంటి విద్యార్థుల ఆశయానికి వైఎస్సార్ ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్ అండగా నిలుస్తోందని షరీఫ్ సంతోషంగా చెబుతున్నారు.



ఈ ఏడాది మార్చిలో ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న షరీఫ్

రాత మార్చిన ఫీజుల మాఫీ

యర్రగొండపాలెం: వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసింది. ఆర్థిక పరిస్థితి కారణంగా పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ అమలు చేసిన 'ఫీజుల మాఫీ' పథకంతో ఎంతో మంది తమ కలలను సాకారం చేసుకున్నారు. వారిలో పెద్దారవీడు మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన బెజవాడ ఏసుబాబు కూడా ఒకరు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వినియోగించుకుని మార్కాపురం జార్జి కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన ఏసుబాబు.. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ ఎస్సైగా విజయవాడలో విధులు నిర్వర్తిస్తున్నారు.

'ఒకటి నుంచి 5వ తరగతి వరకు మల్లవరం ప్రాథమిక పాఠశాల, 6 నుంచి ఇంటర్ వరకు కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ గురుకుల పాఠశాలలో చదువుకున్నా. మా తండ్రి మోషే ఆటో నడుపుతారు. అమ్మ జయమ్మ కూలీ పనులకు వెళ్లేది. ఐదుగురు సంతానంలో ముగ్గురు ఆడపిల్లలు. వాస్తవానికి మా కుటుంబ ఆర్థిక పరిస్థితి నేను బీటెక్ చేసేందుకు సహకరించదు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో 2012–16లో బీటెక్ పూర్తి చేశా. జార్జి కాలేజీ యాజమాన్యం కూడా నన్ను ప్రోత్సహించింద'ని తన గతాన్ని చెమర్చిన కళ్లతో వివరించారు.



తల్లిదండ్రులతో ఎస్సై ఏసుబాబు

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి శుక్రవారం మార్కాపురం పట్టణంలోని తూర్పు వీధిలో కౌన్సిలర్ మారంరెడ్డి లతారామకృష్ణారెడ్డి, పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు వివిధ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. పథకాల మంజూరుకు అర్హులై ఉంటే చాలని, వలంటీర్‌ల ద్వారా నేరుగా లబ్ధిపొందవచ్చన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇల్లు కట్టించే కార్యక్రమం జరుగుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, కొత్త కృష్ణ, సిరాజ్, గుంటక వనజాక్షి, చెన్నారెడ్డి, నాయకులు రంగయ్య, బండారు శ్రీను, మహమ్మద్ ఉస్మాన్, కరీంబాషా, ధర్మకర్త నాలి కొండయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, వైఎస్సార్ సిపి యూత అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, ఉత్తమ్‌కుమార్, ఎం.హేమంతారెడ్డి, నూనె శివారెడ్డి, డీఈ సుబానీ, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఫార్మసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన విద్యార్థులతో అంజిరెడ్డి, ఆదిమూలపు సతీష్ తదితరులు

మార్కాపురం: ఫార్మసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ఎం.అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జార్జి ఫార్మసీ కళాశాలలో 19వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, లక్ష్యంతో చదవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. గత 19 ఏళ్లుగా తమ కళాశాలలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ సమాజానికి మంచి ఫార్మసిస్టులను అందించామని, దేశ విదేశాల్లో తమ విద్యార్థులు సైంటిస్టులుగా, ప్రభుత్వ కంపెనీల్లో ఉన్నతాధికారులుగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు ఏరువ శ్రీనివాసులు, డాక్టర్ కె.ప్రశాంతకుమార్, కళాశాల అకడమిక్ అడ్వయిజర్ డాక్టర్ స్టెల్లా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నిరంతర కార్యక్రమం


గిద్దలూరు: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జంకె, ఎమ్మెల్యే అన్నా

దొనకొండ: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో దోహద పడుతుందని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. కొచ్చెర్లకోట, మల్లంపేట గ్రామాల్లో శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్‌లు పోలుకుమార్, వజ్రగిరి రాణి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ పాల్గొన్నారు.

దర్శి: జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ, డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ టి. రవికుమార్ సూచించారు. లంకోజనపల్లి, ఉయ్యాలవాలలో సర్టిఫికెట్లు అందించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి తెలిపారు. మారెళ్ల, వేముల గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, మండల ప్రత్యేకాధికారి పీవీ రమణ, తహసీల్దార్ నయీం అహ్మద్, ఎంపీడీఓ కుసుమకుమారి పాల్గొన్నారు.

ముండ్లమూరు (తాళ్లూరు): ప్రజలు జగనన్న సురక్ష గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని అవసరమైన సర్టిఫికెట్లు పొందాలని ఈఓఆర్డీ కేజీఎస్ రాజు, డీటీ ఇమ్మానియేలు తెలిపారు. మాధవరం, తూర్పుగంగవరంలో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

పెద్దారవీడు: పేదల అభ్యున్నతి కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని డ్వామా పీడీ శీనారెడ్డి అన్నారు. మండలంలో మద్దలకట్ట, బి.చెర్లోపల్లి గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎం.నాసరురెడ్డి, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు ఆకుమళ్ల శ్రీనివాసరెడ్డి, గుంటు గాలెమ్మ, వీఆర్వోలు గాలిబ్, వెంగళరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మూల సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏర్వ మల్లికార్జునరెడ్డి, కంచర్ల కేశయ్య, పీఎస్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని కృష్ణంశెట్టిపల్లెలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో పాటు ఆయా శాఖల అధికారులు కలిసి గ్రామాల్లో సర్వేలు నిర్వహించి వారికి కావాల్సిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల వివరాలు సేకరించాలన్నారు. ప్రతి సంక్షేమ పథకం, ప్రభుత్వ కార్యాలయాల్లో జారీ అయ్యే 11 రకాల ధ్రువీకరణ పత్రాల మంజూరు వంటి వాటికి సంబంధించిన అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వమని, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. తొలుత కృష్ణంశెట్టిపల్లె సచివాలయం-2 భవనాన్ని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిలు ప్రారంభించారు. ఎంపీపీ కడప లక్ష్మీదేవి, జెడ్పీటీసీ బుడత మధు, కృష్ణంశెట్టిపల్లె సర్పంచ్ దాసరి ఎలిజబేత్, ఎంపీటీసీ నరాల వెంకట సుబ్బామ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణవర్ధన్‌రావు, తహసీల్దార్ సీతరామయ్య, ఎంపీడీవో హేమలతదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ బి.ఓబుల్‌రావు పాల్గొన్నారు.

కంభం: సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి గృహానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. కంభం-3, చిన్నకంభం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, డిప్యూటీ తహసీల్దార్ స్వాతి, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలు అన్ని పరిష్కారమవుతాయని ఎంపీడీవో కే.కవితా చౌదరి అన్నారు. మండలంలోని అనుమలవీడు, అనుములపల్లె గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసి నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను అగిడి తెసుకుని అక్కడ పరిష్కారించేలా చర్యలు చేపట్టారు. అనుమలవీడు, అనుములపల్లె, గౌతవరం సర్పంచులు లతీఫ్, రమేష్, మార్తోట లక్ష్మీదేవి, ఎంపీటీసీ వెంకట రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ బి.నాగిరెడ్డి, తహసీల్దార్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.


మార్కాపురంలో సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్

అర్ధవీడు (కంభం): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని అవసరమైన సర్టిఫికెట్లు పొందాలని ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ అన్నారు. అర్ధవీడులో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఉమారాణి, సర్పంచ్ వసంతమ్మ, జేఏసీ కన్వీనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: మండలంలోని తమ్మడపల్లి, గుర్రపుశాల సచివాలయం పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు 550 సర్వీసులు పరిష్కరించారు. తమ్మడపల్లెలో 307 సర్వీసులు, గుర్రపుశాలలో 243 సర్వీసులకు సంబంధించి లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్, సర్పంచ్‌లు వాడాల పద్మ వీరయ్య, ఇలకోటి శివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: జగనన్న సురక్షతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని వై.పాలెం ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద పీఆర్సీ, మర్రివేముల సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్‌తో పాటు పార్టీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్‌లు మాట్లాడుతూ జగనన్న సురక్షతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని, గతంలో సర్టిఫికెట్స్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలలు తరబడి తిరిగే వారిని, జగనన్న సీఎం అయ్యాక ఈ విధానానికి స్వస్తి పలికారన్నారు. తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పుల్లలచెరువు: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొనకనమిట్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి కె.మాధురి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్లగట్టు, వెలిగండ్ల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డితో కలిసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: పట్టణంలోని 7, 8 సచివాలయాల పరిధిలోని 12, 13, 14వ వార్డుల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, ఇన్‌చార్జి కమిషనర్ సుబానీ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


దర్శి: లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న రవికుమార్

పొదిలి రూరల్: మండలంలోని ఉప్పలపాడు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వహించారు. సంక్షేమ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లను ఎంపీడీఓ శ్రీకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి పాల్గొన్నారు. 628 దరఖాస్తులు రాగా 510 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ హమీద్, వైస్ ఎంపీపీ పుణ్యవతమ్మ, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, ఈఓఆర్డీ అమరేశ్వర్, సర్పంచ్ తిరుపతమ్మ పాల్గొన్నారు. చెన్నారెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహులు, వైస్ ఎంపీపీ కందుల సుజాత, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

ఉచిత వైద్యశిబిరాలను ఉపయోగించుకోవాలి

తర్లుపాడు: ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను ఉపయోగించుకోవాలని తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, పార్టీ నేత రామసుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం చెన్నారెడ్డిపల్లిలో కందుల ఓబులరెడ్డి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. డాక్టర్లు కిరణ్‌కుమార్, షబానా, లక్ష్మీనారాయణ, రమేష్, శ్రవణ్, భవానీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్‌తోపాటు సింగిల్ విండో అధ్యక్షుడు కె.సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కె.సుజాత, సర్పంచ్ మురారి సుబ్బయ్య, ఎంపీటీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి రక్ష

మార్కాపురం: మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యులు వెన్న హనుమారెడ్డి అన్నారు. వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో ఆయన మొక్కలు నాటారు. మొక్కలు నాటి దత్తత తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

కొనకనమిట్ల: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ విజిలెన్స్ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్లు ఆల్ఫాన్స్, టి.శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం విజిలెన్స్ అధికారుల బృందం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించింది. అనంతరం కొనకనమిట్ల విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అదనపు లోడు వాడుతున్న 13 మందికి రూ.35 వేలు జరిమానా, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరి కింద విద్యుత్ వాడుతున్న 19 మందికి రూ.1.80 లక్షలు జరిమాన విధించినట్లు వివరించారు.

అవినీతి ఆరోపణలు రుజువైతే చర్యలు

పెద్దదోర్నాల: ఉపాధి హామీ పథకంలో అవినీతి ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ శీనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొంత మంది సిబ్బంది పనితీరుపై అవినీతి ఆరోపణలు వినవస్తున్నాయన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అవసరమైతే ఉద్యోగం నుండి టెర్మినేట్ చేస్తామని హెచ్చరించారు. దీంతో పాటు నల్లమలలోని పలు గూడేలకు సంబంధించి చెంచు గిరిజనులకు పనులు కల్పించడంలో సిబ్బంది అలసత్యం వహిస్తున్నారన్నారు. మండల పరిధిలోని పలు గూడేల్లో కేవలం 40 శాతం మాత్రమే గిరిజనులు పనుల్లో పాల్గొంటున్నారన్నారు. గూడేల్లోని గిరిజనులకు పూర్తి శాతం పని కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ విజయ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: బేస్తవారిపేట గ్రంథపాలకుడు, రాష్ట్ర ప్రతినిధిగా ఉన్న పాలకొలను వెంకట సుబ్బారెడ్డి రాష్ట్ర గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల నిర్వాహకులుగా కే దేవదాస్, వీవీ రమణ, మల్లిఖార్జునరావు, సుభానీల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్. పిచ్చయ్య యాదవ్, రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షుడు టీ నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

ముండ్లమూరు (తాళ్లూరు): మండలంలోని మాధవరంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రధాన రహదారి వెంబడి సైడు కాలవల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు ఎంపీపీ శ్రీనివాసరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వైఎస్సార్ జయంతి

మార్కాపురం టౌన్: వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ స్ఫూర్తితో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని, 9 గంటలకు గడియార స్తంభం సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కేక్ కటింగ్, 9.30 గంటలకు తూర్పు వీధి జువ్విచెట్టు సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళి, 10.30 గంటలకు పొదిలి పట్టణం కొత్తూరు సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు పొదిలిలో పంటల బీమా పరిహారాన్ని జమ చేస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు భూపతిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

యర్రగొండపాలెం: వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక రాజీవ్ అతిథి గృహం ఆవరణలో కేక్ కట్ చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ముందుగా సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పిస్తామని, ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

కురిచేడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతిని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. స్థానిక బస్టాండు సెంటరులో ఉదయం 9 గంటలకు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సొసైటీ ప్రెసిడెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాటుసారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు

పుల్లలచెరువు: మండలంలోని పలు తండాలపై శుక్రవారం ఎస్ఈబీ అధికారులు దాడు చేసినట్లు సీఐ వెంకట రమణ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎస్ఈబీ, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. నరజాముల తండా పరిధిలో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయగా దాన్ని తయారు చేసే వ్యక్తి నరేష్ నాయక్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం తండాలో నాటుసారాపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. తండాల్లో నాటుసారా తయారు చేయడం, అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమని, దీంతో పాటు ఆరోగ్యాలు కూడా దెబ్బతింటాయన్నారు. ఎవరైనా గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. పుల్లలచెరువు, వై.పాలెం ఎస్ఐలు శ్రీహరి, కోటయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి

మార్కాపురం: మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వరిమడుగు వెంకట్రామిరెడ్డి వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. గత 12 ఏళ్లుగా వైఎస్సార్ టీఎఫ్ సభ్యుడిగా టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వెంకట్రామిరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సంఘ గౌరవాధ్యక్షుడు జాలిరెడ్డి, అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కులదూషణ కేసు విచారణ

కురిచేడు: స్థానిక గ్రామపంచాయతీలో నిధుల గోల్‌మాల్, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య ఫిర్యాదే మేరకు కులదూషణ కేసును దర్శి డీఎస్పీ టి. అశోకవర్ధన్ శుక్రవారం విచారించారు. పంచాయతీ కార్యాలయంలో నిధులను పంచాయతీ ఖాతా నుంచి తన ఖాతాకు రూ. 15 లక్షలు డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటరెడ్డి మార్చుకున్నట్లు తెలిసింది. దానిపై అడిగేందుకు వెంకటరెడ్డి ఇంటికి సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య వెళ్లగా కులంపేరుతో దూషించినట్లు కృష్ణయ్య వెంకటరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీకి నిధులు ఏ ఖాతాకు వస్తాయి, వాటిని ఎలా తిరిగి పనులు చేసిన వారికి చెల్లిస్తారు అనే విషయాలను డీఎస్పీ.. పంచాయతీ కార్యదర్శులు జగన్‌మోహన్ రెడ్డి, చాంద్‌బీలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై యం. దేవకుమార్, ఆవుల వెంకటరెడ్డి ఉన్నారు.

జూనియర్ కాలేజీలో ఆర్ఓ ప్లాంట్

కంభం: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో గోగులదిన్నె నందిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం రూ.4 లక్షలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాతలకు కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్, పీడీ మురళి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు మహబూబ్ బేగ్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ పులి శ్రీనివాస ప్రసాద్, కార్యదర్శి వితా శ్రీనివాసులు, కోశాధికారి బాలరంగయ్య, ఉపాధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ బాషా, గుండయ్య, దాదా, డాక్టర్ సయ్యద్ నజీర్ పాల్గొన్నారు.